# మోర్గాన్ స్టాన్లీతో అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ భారీ ప్రాజెక్ట్

హైదరాబాద్, డిసెంబర్ 27 (సూర్య బిజినెస్ బ్యూరో): రాష్ట్రానికి చెందిన ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ మోర్గాన్ స్టాన్లీతో కలిసి రూ. 400 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్ సమీపంలోని నల్లగాండ్లలో 20 అంతస్తులతో కూడిన రెసిడెన్షియల్ టవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొత్తంగా 16.7 ఎకరాల్లో 20 అంతస్తులతో కూడిన 14 టవర్లను నిర్మిస్తున్నామని, ప్రస్తుతం నాలుగు టవర్లు నిర్మాణం పూర్తి అయిందని అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ - కన్‌స్ట్రక్షన్స్ జనరల్ మేనేజర్ కెవికె రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క టవర్ పరిధిలో 80 అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నామని, మొత్తంగా అపర్ణా సరోవర్ ప్రాజెక్టులో 1120 అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని ఆయన చెప్పారు. తొలి దశలో నాలుగు టవర్ల నిర్మాన్ని పూర్తి చేశామని, వచ్చే మూడు నెలల్లో వీటిని వినియోగదారులకు అప్పగిస్తామని అన్నారు. మొత్తం ప్రాజెక్టును 2009 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని, ఇప్పటికే మొత్తం అపార్ట్‌మెంట్లలో 50 శాతానికిగా బుకింగ్‌లు పూర్తయినాయని రాజు వెల్లడించారు.



## మాంద్యంతో...

ఆర్థిక మాంద్యంతో రియాల్టీ మార్కెట్ మందగించినప్పటికీ తమ సంస్థ చేపట్టిన ప్రాజెక్టులపై ఆ ప్రభావం లేదని, విజయవంతంగా కొత్త ప్రాజెక్టుల బుకింగ్‌లను 75 శాతానికిపూగా పూర్తి చేశామని అన్నారు. మధ్యతరగతికి అందుబాటులో ఉండే విధంగా రూ. 25 లక్షల నుంచి 35 లక్షల లోపు ఉండే లగ్జరీ అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని కూడా త్వరలో చేపట్టనున్నట్లు రాజు చెప్పారు. అపర్ణా సరోవర్‌లో చదరపు అడుగు రూ. 3,300లకుపైగా ఉందని, మొత్తంగా యూనిట్ ధర రూ. 70 లక్షలు వరకూ ఉంటుందని అన్నారు. స్టీల్ ధరలు తగ్గినప్పటికీ బహిరంగ మార్కెట్లో ఇతర నిర్మాణ సామాగ్రి ధరలు మండుతూనే ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో అపార్ట్‌మెంట్ ధరలను తగ్గించే అవకాశమేలేదని అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలు, లగ్జరీ సదుపాయాలతో అపర్ణా సరోవర్‌ను తీర్చిదిద్దుతున్నామని రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్ డిఎస్ ప్రసాద్, సేల్స్-జిఎమ్ జి శ్రీధర్ పాల్గొన్నారు.